# మంచుముద్ద

**నా** తెలంగాణ కోటి రతనాల వీణ-ఆశయం సూపర్. ఆచరణలోనే మెలిక వేస్తుంది ప్రకృతి. మెతుకు (మెదకు) సీమలోని మెతుకు నేతి బీరకాయలోని నెయ్యిలాగై పోతుందని ఊహించి ఉండరు.

బలహీనుడి మీదికి బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్టు - బండల గుండెల్ని బద్దలు కొడుతున్న ఎండలు రోజంతా చంద్రనిప్పులు కురిపిసున్నాయి. వానకాలంలో గాలి జోరు, చలికాలంలో చలితో బేజారు. నాలుగేళ్ళ నుండి ఇదే తంతు. ఎండకాలం మాత్రం బలం పుంజుకుని సార్థక నామదేయురాలైంది. మేకమాంసం మరిగిన తోడేలులా ఏటేటా రెండాకు లెక్కువ చదివేసి ప్రాణాలను పీక్కు తింటుంది. చెప్పులు లేకుండా బయటికెళ్ళాలంటే - ఎర్రని నిప్పుల మీద నడవాలన్నట్టే.

"వసంతకాలమంటే - చెట్లన్నీ ఆకుపచ్చ పీతాంబరాలు కట్టుకున్న ముత్తైదువుల్లాగుండేవప్పుడు."

"మా చిన్నప్పుడు బావులల్ల, చెరువులల్ల గంగమ్మ తల్లి కాపురముండేది. ఎండాకాలంలో పొద్దంతా ఈతగొట్టేవాళ్ళం. విసుగొస్తే మామిడి తోటల్లో కోతికొమ్మచ్చి ఆడుకునేవాళ్ళం."

"ఆ కాలమేమైందో! ఆ రోజు లెటుబోయినయో! ఏ దేవుని శాపమో! మల్లా అటువంటికాలం ఈ కండ్లతో చూస్తమో లేదో!"

గుట్టల్లోకి జారవిడిచినట్టున్న రాఘవాపురంలో ఏ పెద్దమనిషిని కదిపినా అవే మాటలు.

నీళ్ళులేని బావులు బ్రహ్మరాక్షసుల్లా నోళ్లు తెరుచుకున్నాయి. సగం కుటుంబాలు ఊరు విడిచి నీటి జాడల్లోకెళ్ళిపోయాయెప్పుడో. మిగతా కుటుంబాల తాహతు పుట్టిన ఊళ్ళోనే తాడో పేడో తేల్చుకొమ్మని శాసించింది.

కడుపులో ఎలుకలు పరుగులు దీస్తున్నా - ఎండకు బయటికొచ్చే ధైర్యం చాలక, వడదెబ్బకు వాడిన కూరాకుల్లా ఇళ్ళల్లోనే పడుంటున్నారు సగటు మనుషులు.

చైతన్యం కోల్పోయి శాపగ్రస్తమైనట్టు - మోడు బారిన చెట్లతో, మాడిన పశువుల డొక్కలతో మరుభూమిగా కన్పిస్తుందా ఊరు. నీటి కరువు కళ్ళకు నీళ్ళు దెప్పిస్తుంది. కండలూ, నెత్తురూ లేని మనిషిలా తడిలేని చేద బావులు తమ ఉనికి నెప్పుడో కోల్పోయినై.

మేత కరువైన పశువుల అరుపులు దొడ్లను దాటి ఊరందరి గుండెల్లో రైలు కూతలు వినిపిస్తున్నాయి.

బీడువారిన పంట పొలాలు 'మామీద నీకెందు కింత పగ?' అని దీనంగా ప్రశ్నిస్తూంటే. ఈ రోజుకిక చాల్లే అనుకుని సూర్యుడు ఉగ్ర రూపం ఉపసంహరించి పడమటి కొండల్లోకి జారుకున్నాడు. మేడల నీడలు వాకిళ్ళముందు పలచబడుతున్నాయి. బయటికొచ్చే సమయమైంది జనాలకు.

తలుపులు తెరుచుకుని జగదాంబ బయటికొచ్చింది. ఇంటి ముందున్న దొడ్లోంచి 'అంబా, అంబా' అని వినబడింది. అయిదు పదులు దాటిన జగదాంబ అటు నడిచింది. అన్నీ పోగా మిగిలిన రామలక్ష్మణులు దీనంగా చూస్తూ మరోసారి 'అంబా' అన్నాయి కడుపులో కలుక్కుమంది. పొద్దుట్నుంచి నీళ్ళూ, మేతా లేక డొక్కలు పీలాపడిన్నై.

నిప్పులు గక్కే ఎండను లక్ష్యపెట్టకుండా రెండు గంటలముందే కొడుకు మురళి కావడి తీసుకుని నీళ్ళ వేటకు బయల్దేరాడు. ఊళ్ళో నీళ్ళు దొరకడం కల్ల. ఊరు బయటకెక్కడికో వెళ్ళుంటాడు. మురళి నీళ్ళుదెస్తేనే ఎడ్ల ప్రాణాలు దక్కేట్టుంది. రాత్రి వంటగ్గూడా కావాలాయె.

తన భర్త బతికున్నప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడా! కేవలం పదేళ్ళ లోనే కాలగతులిలా మారాయేమిటి? పరిస్థితి అప్పుడిలాగే ఉంటే నలుగురు కూతుళ్ళ పెళ్ళిళ్ళు, సారెలూ, కాన్పులూ అంత వైభవంగా జరిగేవా? ఆడపిల్లలు అదృష్టం నిచ్చెన మెట్లెక్కిం తర్వాత, మురళి ఎదిగాడు. చదువు పూర్తిగాకముందే తండ్రిని పోగొట్టుకున్నాడు.

మిగిలిన రెండెద్దులు- అవే....రామలక్ష్మణులు - తమ దొడ్లో పుట్టి పెరిగినవే. కన్నతల్లి 'లక్ష్మి' గోముగా వాటి వీపు నాకుతూంటే చూడ ముచ్చటేసేది. లక్ష్మి కడవెడు పాలిచ్చేది. పిల్లలు రోజుకు రెండుసార్లు గుమ్మపాలు తాగేవారు. ముప్పూటలా గడ్డ పెరుగుతో భోంచేసేవారు. చేతి నిండా నెయ్యి పోసుకుని అన్నంలో కలుపుకునేవారు. అదో స్వర్ణ యుగం. వృద్ధాప్య మావరించి లక్ష్మిని దొడ్డికే పరిమితం చేసింది.

"ఈ ఆవు ముసలిదైందిగదా, నా కమ్మేయమ్మా!" అడిగాడో రోజు చెప్పులు కుట్టే బాలయ్య.

తనకు చిరాకేసింది. బాలయ్యను చీరెయ్యా లనిపించింది. కానీ, అతని వృత్తి అతన్నలా అడిగించిందని శాంతించింది.

"ఇది నా ఇంటి లక్ష్మి బాలయ్యా! దీన్ని అమ్ముకోవడమంటే కన్నతల్లిని అమ్ముకోవడమే."

"అయ్యో.... గట్లంటే ఎట్లమ్మా! ఇయ్యాల్లగాకపోతే రేపు ఛస్తది. గప్పుడైనా నన్నే పిలిపించి తీస్కపొమ్మంటరు గదా?...".

ఇంకేదో అనబోయిన బాలయ్యను తన ముఖకవళికలు ఆపేశాయి.

"చచ్చిం తర్వాత ఏం జెయ్యాల్నో నాకు బాగా దెల్సు. ఇప్పుడు నువ్వింకేం మాట్లాడినా మర్యాద దక్కదు. పో!" గర్జనలాగొచ్చింది గొంతులోంచి. ముక్కుపుటా లెగిసిపడ్డాయి.

లక్ష్మి పార్థివ శరీరం తమ పొలంలోనే భూస్థాపితమైంది. రామ లక్ష్మణులు దాని గుర్తులుగా మిగిలాయి.

జరిగిపోయిన రోజులు జ్ఞాపకాల పొరల్లో దోబూచులాడుతున్నాయి.

"అమ్మా, నీళ్ళు దెచ్చిన్నే!" శత్రుదుర్భేద్యమైన రెండు కోటలు జయించుకొచ్చిన వీర శివాజీలా మురిసిపోతూ కావడితో వచ్చాడు మురళి.

చుట్టుపక్క లమ్మలక్కల ప్రాణం లేచొచ్చింది.

"ఎక్కడ దొరికినయ్ మురళీ?" ఆత్రంగా అడిగారు నలుగురొకే సారి.

"మనూరి పొలిమేర దాటిపోయిన. లింగారెడ్డి పల్లె దూదేకులోల్ల మోటబాయిల బోరింగేసింద్రు. మోటరు పెట్టింద్రు మొన్ననే....బతిమలాడి తెచ్చిన."

ఊళ్ళో కొందరు బోరింగులు వేయించుకున్నారు. కొన్ని ఫెయి లైనై. మరికొన్ని నెల రోజులు మురిపించి మూతులు ముడుచుకున్నై...

...బిలబిలమంటూ ఆడవాళ్ళు కడవలు అందుకుని బయలుదేరారు దూదేకులోల్ల బావికి. ఒకరి నొకరు పట్టించుకోని పరుగుల నడక చూస్తుంటే - కడవల పరుగుపందెమేమో ననిపించింది.

"మంచి పంజేసినవవ్ కొడుకా! లేకపోతే మన ప్రాణాలు నిలిచే తట్టు లేవు" అంటూ కావడిలోని ఒక్క కడవ నీటిని రెండు పాత ప్లాస్టిక్ బకెట్లలో పోసి ఎద్దులముందుంచింది జగదాంబ.

రామలక్ష్మణులు చెవులాడిస్తూ అవురావురుమంటూ తాగేశాయి. మరో కడవెడు నీళ్ళు రాత్రి వంటకు సరిపెట్టుకున్నారు.

o o o

"అమ్మా! నువు నానమ్మవై పోయినవే."

"ఆఁ.... నిజమా? మీ మామ ఉత్తరం రాసిండా?"

"ఔనే.... నాకు కొడుకు పుట్టిండంటా.... టాట్టట్టా."

అయితే, ఈ జగదాంబ ఇంట్లో జగదేకవీరుడు ఆడుకుంటాడన్న మాట.''

"వెంటనే వెళ్ళి నీ పెళ్ళాన్నీ కొడుకునూ చూచిరా పో!''

''ఆ ఊరికెట్ల పోవాల్నె ఇప్పుడు?''

''ఔగ్రా.... నువు పెండ్లిజేసుకుని జానకితోని రామలక్ష్మణుల కచ్చరమ్మిదొస్తివి. అప్పుడు ఏనుగులోలె ఉన్న మూగజీవాలు ఇప్పుడు పీనుగులై పోతున్నై. కచ్చరం నడువది. బస్సుమీదపోయిరా!''

"అమ్మా! నీగ్గూడా మనవణ్ణి చూడాలన్పించడం లేదా?''

''ఎందుకన్పించదురా? మనూరిని దరిద్రం పీడ పట్టుకుంది. లేక పోతే నీకంటే ముందే నా మనవనికి బొమ్మలూ అవీ తీస్కొని పోదుంటి. నా ప్రాణాలన్నీ ఆ బుడ్డోడి మీదా, జానికి మీదనే ఉన్నాయిరా! మనిద్దర మొకటేసారిపోతే ఇక్కడ రామలక్ష్మణులు ఆగమైపోతరు గదా!''

"మా అమ్మ కప్పుడే మనవడిమీద మనసు పడించే! నిజమేనమ్మా! నేను వచ్చింతర్వాత నువ్వు పోయిరా."

హమ్మా! వీడికెంత ఇది? తన కొడుకును తానే ముందు చూడాలని ఆరాటం. కడుపు తీపి కింద కడవెడు అమృతమైనా దిగదుడుపే.

"సరే మంచిది, నువు బయల్దేరు."

o o o

ఉదయం.... భూమాత వలుముకున్న చీకటి బూడిద రంగుగా మారుతోంది.

"అమ్మా! జగదాంబమ్మా!" గ్రామాధికారి కిష్టారెడ్డి పిలుపు.

జగదాంబ తలుపులు తీసింది. కిష్టారెడ్డి వెంట ఇద్దరు కొత్త మనుషులున్నారు. వాళ్ళనెప్పుడూ చూడలేదు.

"ఏంది కిష్టారెడ్డీ?" తాను గూడా బయటికొచ్చింది.

''ఏం లేదమ్మా.... మరీ.... మరి....'' మెలికలు తిరిగినంత పనైపోతూంది. నవ్వాపుకుంది జగదాంబ.

''చల్లకొచ్చి ముంత దాస్తావెందుకూ?"

"మరి నువ్వేమీ అనుకోవద్దమ్మా!''

''సరే, చెప్పు.''

"పీళ్ళిద్దరూ పశువుల ఖరీదుదార్లు.నిన్న రాత్రే మనూరి కొచ్చింద్రు. పశువుల్ని కొంటున్నరు. చాలామంది అమ్మింద్రు.''

"ఔనమ్మా! గేదెలూ, ఆవులూ, ఎద్దులూ, దున్నపోతులూ.... లారీ సగం నిండింది. ఇంకో గంటలో వెళ్ళిపోతాం" అన్నాడు కొత్త మనిషి.

విషయమేమిటో అర్థమైపోయింది. కడుపులో తెడ్డుతో కలబెట్టి నట్టనిపించింది.

"ఈ కరవు దెయ్యం మనూర్లె జొచ్చె." కిష్టారెడ్డి తనవంతు దళారీ కర్తవ్యం నిర్వహిస్తున్నాడు. "మనషులకే తినేతందుకు, తాగేతందుకు కరవాయె. ఇంగ పశువులనెట్ల దక్కించుకుంటాం?"

నిజమే....కష్టమే.

"మీ దగ్గర గూడా రెండు ఎద్దులున్నాయిగదా!" దొడ్లోకి చూస్తూ స్థిరంగా అన్నాడు రెండో కొత్తమనిషి.

నరాలు మెలిబెట్టినట్టనిపించింది.

"మీదే ఊరు?"

"మాది మచిలీపట్నం - కృష్ణాజిల్లానండీ!"

అదృష్టవంతులు. కృష్ణా, గోదావరమ్మలు కోస్తాజిల్లాలకు కొంగు బంగారాలై పోయినై. వర్షంతో పనిలేకుండా, కరవు కాటకాల నాఛాయలకు రానీయవు. పొలాల్లో బంగారం పండుతుంది. గొడ్లూ గోదా ఎప్పుడూ పచ్చగా ఉంటై. అక్కడైతే నా రామలక్ష్మణులకు నీళ్ళకూ, మేతకూ కరవుండదు. ఇక్కడే ఉంచి వాటి ప్రాణాలు దీసేకన్నా అమ్మిందే నయం.

"మరి....మీ ఎద్దుల్ని...." ధైర్యం చాలక బ్రేకులేసిన సైకిల్లా ఆగిపోయాడు కిష్టారెడ్డి.

ఎటో నెళ్తున్న ప్రతాపరెడ్డిని కేకేసి పిలిచాడు. ఏడు పదులు దాటిన ప్రతాపరెడ్డి కర్ర సాయంతో వచ్చాడు.

"మన ప్రతాప్ తాత గూడా అమ్మిండు ఆవుల్ని, ఎడ్లనూ...." నవ్వబోయి ఆగిపోయాడు కిష్టారెడ్డి.

జగదాంబ కనురెప్పలు, కనుబొమలూ పైకి లేచాయి-'నిజమేనా?' అన్నట్టుగా.

"అమ్మినాను తల్లీ! భూమ్మీద చుక్కనీళ్ళు లేకపాయె. వాటికి మేత లేకపాయె. ఇన్ని రోజులు వ్యవసాయంజేసి మనల్ని కాపాడిన పశువులు ఇప్పుడు అమ్ముడుబోయి మనల్ని కాపాడుతున్నాయి. నాల్గు రూపాయలు చేతులకొస్తే పట్నం నుంచి తినే గాసమైన తెచ్చుకుంటాం గదా!"

"ఏందో పెద్దయ్యా! స్వతంత్రమొచ్చి గిన్నేండ్లయిందిగదా! మన గతి గింతనే ఉండిపాయె." నిట్టూర్చింది జగదాంబ.

ప్రతాపరెడ్డి ముఖమ్మీద విషాద రేఖలు.

"ఔను బిడ్డా! నన్ను జూడు ఇంగ్లీషోని జమాన జూచిన, నైజాం జమాన జూచిన, ఇప్పుడు ఈ జమాన జూస్తున్నా. ఎవలొచ్చినా, పోయినా మన రాజ్యంల కరువు మాత్రం పోలేదు. వోట్ల కొరకు దిరిగెటోల్లే కాని, మన పాట్లు జూసెటోల్లే లేరు. అప్పుడు ప్రకృతి చల్లగా చూచేది. ఇప్పుడు కోపానికొచ్చింది.గివన్నీ చూసెతందుకే ఈ పాడు జన్మ ఇంకా ఉందమ్మా! ఈ కరువు పాడుగాను. పసిపిల్లలు ఆకలితో మాడుతున్నరు, బిడ్డలనంటి పశువుల్ని అమ్ముకుంటి." గొంతు జీరబోయింది. గుండె గుబగుబలాడింది.

మసకబారుతున్న కళ్ళను రుమాలుతో అద్దుకుంటూ "పశువులను అమ్మవద్దనుకుంటే వాటిని చంపిన పాపం మననే చుట్టుకుంటుందాయె. మరింకేం జెయ్యాలె?" నిట్టూర్చాడు.

ఉదయం నీరెండలా ఉబికొస్తుందో నిర్ణయం జగదాంబలో.

మురళి లేకపాయె అనుకుంది మొదట. ఆ తర్వాత .... వాని తోడబుట్టిన తమ్ముళ్ళలాగున్న రామలక్ష్మణుల ప్రాణాలు నిలబడుతూంటే వద్దంటాడా? వాడొచ్చేదాకా వీళ్ళాగరై రి.

"వాటిని అమ్మాలంటే నా కొడుకుల్ని అమ్ముతున్నట్టనిపిస్తుంది కిష్టారెడ్డీ! కాని, ఏం జేస్తాం? మన దగ్గరుంటే అవి బతుకవాయె!" అంది.

కిష్టారెడ్డి అంతరంగం రెపరెపలాడింది. కమీషన్ కళ్ళముందు కనబడింది.

''నీళ్ళూ, మేతా లేక అవి కొట్టుకుంటుంటే వాటి గొంతులు పిసికి చంపాలనిపిస్తుంది బిడ్డా, మనకే!" ప్రతాపరెడ్డి హెచ్చరిక.

బేరం కుదిరింది. బరువెక్కిన గుండెల్తో మెల్లిగా దొడ్లోకెళ్ళింది జగదాంబ. రామలక్ష్మణుల వీపు నిమిరింది. కళ్ళు తడైపోయాయప్పటికే.

"మీకూ, మాకూ రుణం తీరిపోయిందిరా!" రెండు చేతులో ఎద్దుల మెడల్ని వాటేసుకుని బోరుమంది. రాముని కేమనిపించిందో గొంతును జగదాంబ భుజమ్మీదానించింది. లక్ష్మణుడు 'అంబా' అంటే, అది 'అమ్మా' అని వినిపించింది.

''ఈ పాపిష్ఠిదాన్ని క్షమించురా లక్ష్మణా! మీరు బతికిబయటపడా లనే నా ఆరాటంరా!" గొణుగుతూ మూపురమ్మీద నిమిరింది.

''ఇంగ దీసుకపోండ్రి" అని ఇంట్లోకేళ్ళి తలు పేసుకుంది.

పశువులతో లారీ నిండేసరికి తొమ్మిదైంది. అప్పటికే సూర్య ప్రతాపం - వేలిముద్రగాళ్ళ ముందు మహా పండితుని సాహిత్యోప న్యాసంలా విజృంభించింది.

'అంబా - అంబా'లతో లారీ కదలబోతోంది. ఇవే మా కడసారి చూపులన్నట్టు పశువులు అక్కడే నిల్చున్న తమ మాజీ యజమానుల్ని చూస్తున్నాయి. కరిగిన గుండెలు కన్నీరై బయటికొస్తుంటే, వీడ్కో లిస్తున్నారు జనాలు.

కిష్టారెడ్డి కమీషన్ పైసల్తో సహా ముట్టజెప్పి లారీ వెళ్ళిపోయింది.

దిండులో తలానించి చాలాసేపు వెక్కివెక్కి ఏడ్చింది జగదాంబ. గుండె కుదుటబడ్డం కష్టమైంది. సాయంత్రం కడవందుకుని నీళ్ళకొరకు బయలుదేరింది.

నలుగురైదుగురు ఆడవాళ్ళు కలిశారు. అందరి గమ్యం దూదేకులోళ్ల బావే. పశువుల అమ్మకాలు చర్చనీయాంశమైంది. చర్చాంతంలో—

"చూసి చూసి ప్రాణమోలె పెంచుకున్న పశువుల్ని కసాయోళ్ళ కమ్మితిని" అని విచారం వెలిబుచ్చింది కిష్టారెడ్డి భార్య సుగుణ.

వీపు మీద చర్నాకోల దెబ్బ పడినట్టయింది జగదాంబకు.

"కసాయోళ్ళా? కాదు సుగుణా! వాళ్ళు మచిలీపట్నపోళ్ళటా?"

"బేరగాళ్ళు మచిలీపట్నపోళ్ళే. కాని, మనూరి పశువుల్ని తీస్కపోయింది మాత్రం రుద్రారంకు. అక్కడి అల్ కబీర్ ఫ్యాక్టరీకి. అది చాలా పెద్ద పశువధ్యశాలనట. అక్కడి నుండి పశువుల మాంసం విదేశాలకు పంపుతారట." బుగ్గలు నొక్కుకుని చేతులూపుతూ చెప్పింది సుగుణ.

జగదాంబ బుర్రలో అటంబాంబు పేలింది. కాళ్ళలో వణకు బయలుదేరింది.

"అయితే, నా రామలక్ష్మణుల్ని గూడా...."

"మరింకెందుకనుకున్నావు? ఈపాటికి మన పశువుల మాంసం విమానమెక్కిపోయుంటుంది." ప్రతాపరెడ్డి కోడలంది - గాలికి విడిపోతున్న ముంగురుల్ని సవరించుకుంటూ.

పిచ్చెక్కినంత పనైపోతుంది - జగదాంబకు. నరాల్లో యుద్ధ వాతావరణం. ఆదరాబాదరాగా నీళ్ళు దీసుకుని ఇల్లు చేరింది. కడవ దించి మంచమ్మీద వాలిపోయింది.

నా చేతులు పడిపోనూ.... నా రామలక్ష్మణులను యమదూతలకమ్మినానా? నా చేతుల్తో నేనే నా బిడ్డల్ని చంపుకున్నానా? ఏ జన్మల ఏ పావం జేసినో.... భగవాన్.... నాకెందుకీ శిక్ష?

బొటబొటా రాల్తున్న కన్నీటి నాపుకోవాలనిపించలేదు. గుండె చెరువైపోయింది.

....అల్ కబీర్ ప్యాక్టరీ కత్తులు రామలక్ష్మణుల మెడల్ని పరపర కోస్తున్నాయి. అవి 'అంబా.... అంబా.... జగదాంబ తల్లీ!.... ఎంత పంజేశావమ్మా.... నీకు దయలేదా?' అంటూ కేకలేస్తున్నాయి. తలలు తెగిన మొండాలు కొట్టుకుంటున్నై. తెగిన నరాల్లోంచి రక్తం కాలువలై ప్రవహిస్తూంది. వాటి అణువణువూ తననే నిందిస్తుంది. తెగిన తలలు—

'మమ్మల్ని కోతకప్పగించే బదులు నువ్వే గొంతు పిసికి చంపక పోయావా?' అని ప్రశ్నిస్తున్నాయి. ఈ పాపం ఊరికే పోదని శపిస్తున్నాయి. పాపభీతి ఒళ్ళంతా పాకి గుండెల్ని గట్టిగా పిండేస్తూంది. బాధ.... భరించరాని బాధ.

"రామా! లక్ష్మణా!" గుండె అరలు పగిలేలా అరిచి దిండుమీద ఒరిగిపోయింది.

ఈ రోజు గూడా కరవు రక్కసి కరాళ నృత్యాన్ని చూడలేనని దినకరుడు పడమటి గదిలో కెళ్ళాడు విశ్రాంతికొరకు. ప్రకృతి నిర్దయకు నిరసనగా నల్లని తెరలు భూమ్మీదికి దిగిపోతున్నాయి.

"అమ్మా! అమ్మా! నీ మనవడెంత బావున్నాడనుకున్నావ్. అచ్చం నీ పోల్నే ఉన్నాడే...." అత్తారింటినుండి వచ్చిన మురళి మంచం దగ్గరి కొచ్చి అన్నాడు హుషారుగా. కొడుకు బుల్లిచేతులూ, బోసినవ్వులూ మెరిశాయతని కళ్ళల్లో.

తల్లి స్పందించలేదు.

"అబ్బా.... పగటి నిద్ర ఇంత సేపా?"" అసహనంతో తల్లి కాలును కదిపాడు. మాట్లాడలేదు. గాబరాగా చెయ్యి తడిమాడు. తల్లి ఒళ్ళు చల్లగా.... అతిచల్లగా.... మంచుముద్దలాగై పోయింది.

(ఇండియా టుడే 6-20 ఫిబ్రవరి, 1995)